169) లలిత

ప॥ కటకటా కర్మమా కాలములో మర్మమా। మటమాయైపోతివంటా మది నమ్మివుంటిగా॥

చ॥ పాపబుద్ధి యాడనుండె పాయము రానినాడు। కోప మేడ నుండె గర్భగోళమున నున్ననాడు।
దీపన మేడ నుండె దేహధారి గానినాడు। యేపున భూమి బుట్టితే నేడనుండి వచ్చెనో॥

చ॥ నగుసంసార మెందుండె నరకాననుండునాడు। తగిలి మరణదెస ధనవాంఛ లెందుండె।
వొగి లోభ మేడ నుండె వొంటి నున్ననాడు। వెగటై నేడెట్టు నన్ను వెదకి పైకొనెనో॥

చ॥ బహుబంధా లేడ నుండె ప్రళయకాలమునాడు। మహి గోరికె లెందుండె మతి మఱచిననాడు।
యిహమున శ్రీవేంకటేశు శరణంటి నేడు। విహితమై మాకు నెట్టు వెఱచెనో తాము॥